సీరియల్ ప్రారంభం!

# రెడ్డెమ్మగుండు

ఆర్. వసుంధరాదేవి

చిత్తూరుజిల్లా చాల అందమైన ప్రదేశం. ముఖ్యంగా మదనపల్లె, వాయల్పాడు తాలూకాలు అనాదియైన ప్రకృతి ఘనీభవించినట్లు, ?రమశాంతి రూపు కట్టినట్లు, ప్రకృతిశోభ మూర్తీభవించినట్లుగా ?ంటాయి.

జ్యేష్ఠమాసపు ఎండల్లో ప్రయాణంతో విసిగిపోయివున్న శివరావు ?ంగుళూరు – కడప బస్సు మదనపల్లె స్టాండునుంచీ బయల్దేరాక కాస్త ?రుకున్నాడు. మధ్యాహ్నం నాలుగు గంటలు దాటింది. ఎండతీవ్రత ?ప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నది. అయినా దాని తాలూకు మగత ?పంచాన్ని వదలలేదు.

బస్సు పరుగెడుతూవుంటే కొండల వరుసలు, ఆ వరుసల ?ధ్యల్లో వైశాల్యం, చెట్ల పచ్చదనం, మధ్యమధ్యన దూరాల్నుంచీ ?స్పించే నీలిరంగు చెరువులూ, అక్కడొకటీ యిక్కడొకటీ చిన్న ?ాళ్లు – అన్నీ మెల్లగా వెనక్కు జరుగుతూ, అతన్నొక స్తబ్ద ?ౌందర్యంలోకి జరుపుకు పోతున్నవి.

ఎవరో పెద్దగా 'గుర్రం కొండ!' అన్నారు. శివరావు ?లిక్కిపడి చూచాడు.

ఎదురుగా ఎత్తైన కొండ!

'గుర్రంకొండ నవాబు తన గుర్రాన్ని పరుగెత్తించుకుంటూ ?ా కొండను అట్నుంచీ యిటుకి దాటేవాడట! అందుకే దాన్ని ?ర్రంకొండ అంటారు.' శివరావు ప్రక్కన కూర్చున్న మనిషి అవతలి ?ట్లోని ఆడమనిషికి చెప్తున్నాడు. కనుబొమలు బాగా పైకిలేపి, కుడి ?య్యి బాగా పైకెత్తి, కళ్లు వెడల్పు చేస్తూ చెప్పాడాకొండ గొప్పదనం ?ురించి.

శివరావు కొండను చూచాడు. చాల ఎత్తుగా, ఠీవిగా వున్నది ?ొండ. గుర్రంమీద యింతటి కొండను దాటటం సాధ్యమా? ఇది ?జమా, కాదా? అన్న ఆలోచనలు రాలేదు. ఆ నవాబు గురించి అతను యిదివరకే వినివున్నాడు. బలమైన గుర్రంమీద వేగంగా స్వారీ చేస్తూ కొండను దాటుతున్న సాహసి నవాబు అతని మనసులో మెదిలాడు. అంతా చాలా పరిచితంగా అనిపించింది. ఆ కొండను ఆ గుర్రంమీద తానే దాటేస్తున్నట్లు వేగం అనుభూతి కలిగి ఉత్సాహమూ, ఉద్రేకమూ కలిగాయి.

'యాడదాకా?' అంటూ శివరావును పలుకరించాడతను.

రాయలసీమ ప్రవేశించినప్పటినుంచీ కన్పిస్తున్న తరహా నడి వయసు మనిషి అతను. ఉన్నవయసు కంటే ఎక్కువగా కన్పిస్తూ, పలుచగా నిటారుగా వుండి, పక్కాకు నముల్తూ, ఎదుటి మనిషిని గురించి ఆసక్తితో ఆరాలు కనుక్కునే స్నేహపాత్రుడైన క్రింది మధ్య తరగతి మనిషి అతను.

శివరావు సమాధానం చెప్పలేదు. అతన్ని రూపొందించిన నాగరకత 'నాసంగతి ఈ మనిషికెందుకు చెప్పాలి?' అన్నది.

కాని అతను కుతూహలంతో పట్టువదలని విక్రమార్కుడిలా యిటే చూస్తూండటం గమనించి "రెడ్డెమ్మగుండు!" అన్నాడు విసుగ్గా.

అది వినగానే అతను ఆత్మీయంగా నవ్వాడు. నవ్వుతూనే,అంతా అర్థమైపోయినట్లు తలూపుతూ "మొక్కుబడా?" అన్నాడు.

'జిడ్డుమనిషిలాగున్నాడు' అనుకుని శివరావు అవతలివైపుకి తిరిగిపోయి కిటికీలోంచి బయటకు చూస్తుండిపోయాడు.

అయినా అతను విడిచిపెట్టలేదు. "రెడ్డెమ్మగుండుకైతే నీవు దిగాల్సింది తొట్లోరిపల్లెలో!" అన్నాడు.

శివరావుకిది క్రొత్తవిషయం. అతనివేపు తిరిగి సందిగ్ధంగా చూశాడు.

"రెండూ ఒక దగ్గిరేలే...అంతా ఫర్లాంగు దూరంవుంటుంది... ఇంతకీ ఎక్కడ మకాం?" అడిగాడతను.

"రామిరెడ్డి... రామిరెడ్డియింట్లో" అన్నాడు శివరావు.



ఇప్పుడామనిషి ముఖంనిండుగా నవ్వు విరిసింది,

"అట్లయితే నువ్వూ, నేనూ దిగాల్పింది దద్దాలోరిపల్లెలో!... దీ అనుకునే వుంటదిలే" అంటూ వివరించాడు. శివరావు ముఖంలోని ప్రశ్నార్థకం చూసి, "మాయన్నే రామిరెడ్డి... నాపేరు ఎంకట సామి నాయుడు" అన్నాడు,

శివరావు కొంచెంసేపు గమ్మగా వుండి "రెడ్డి తమ్ముడివైతే నాయుడెట్లాగయ్యావ్? అన్నాడు.

"ఇక్కడ కమ్మోళ్లంతా నాయుళ్లే!... రెడ్డిపనిచేస్తే రెడ్డి... హాయన్న ఆ పల్లెకు రెడ్డి! ముందుకువంగి, వక్కాకు తాలూకు ఎంగిలి న్ను కిటికీలోంచి బయటకు వుమిసి, తలూపుతూ తీరిగ్గా చెప్పాడు. క్కాకు తాలూకు ముద్ద కుడి బుగ్గలోనుంచీ ఉబ్బుగా కనిపిస్తోంది.

"నువ్వు ఇశాకపట్నంనుంచీ వస్తావుండావు గదూ? మాయన్న రామిరెడ్డికి జాబేశావని మావాడు—మా చిన్నోంకటా—అన్నాడు...అబ్బా రాటికిటువంటి వంటే కుశాలు! వాడు బి. ఏ. వరకూ చదివాడు కాలే జిలో—మదనపల్లిలో" అన్నాడు.

శివరావు సమాధానం చెప్పకుండానే దద్దాలోరిపల్లె వచ్చింది· అప్పుడే సంధ్యచీకట్లు అలముకోవటం ప్రారంభమైంది...

## 2

దాదాపుగా రెండు వందేళ్ల క్రిందటి సంగతి...

చెర్లోపల్లిలో ఒక యింటి అందాల ఆడపడుచు రెడ్డెమ్మ. ఊరికి ఆనుకునే వున్న తమ చేలో కాపలాకాస్తున్నది. ఆమెకు దగ్గర్లోనేవున్న ఒక గుట్టతప్పించి చూపుమేరంతా చేలే! అంతా దాదాపు నిర్మానుష్యంగా వున్నది. సరిగ్గా అప్పుడు గుర్రంకొండ నవాబు అటుగా వెళ్తూ రెడ్డెమ్మను చూచాడు. ఆమెను పట్టడానికి గుర్రాన్ని చేనుకడ్డంగా ఉరికించు కుంటూ వచ్చాడు· రెడ్డెమ్మ అటు పరుగెత్తింది, ఇటుపరుగెత్తింది. ఆఖరికి గుట్టమీదికి వెళ్ళింది·అక్కడున్న పెద్ద గుండుచాటుకు వెళ్లింది. మరి కన్పించలేదు. వెతికి వెతికి వేసారిన నవాబు తిరిగి వెళ్లిపోయాడు. సంగతి తెలిసి ఉరక లెత్తుకుంటూ వచ్చిన ఆమె అన్నలు గుండు దగ్గరకు వచ్చారు... గుండు మధ్యగా చీలివుంది.... మూడంగుళాలవెడల్పు చీలిక... అంతకంటే మరేమీ కన్పించలేదు వాళ్లకి. అక్కడే కూర్చుని దుఃఖిస్తున్న అన్నల్తో గుండులోపలనుండే మాట్లాడింది రెడ్డెమ్మ. వాళ్లని ఓదార్చింది. కాని బయటకు మాత్రం రాలేదు. ఆ తరువాత అటుగా వెళ్తున్న ఆర్తులైన బాటసారులతో మాట్లాడిందనీ వాళ్ల మొక్కుబళ్లు తీర్చిందనీ చెప్పుకున్నారు జనం.

ఆ చీలిక లోపలగా చిన్న శక్తి విగ్రహం వెలిసింది. అక్కడికి వచ్చిన ఎందరికో మొక్కుకున్న కోరికలు తీరాయి. అక్కడ చిన్న కోవెలా, కోనేరూ, చుట్టూ దద్దనాలూ ఏర్పడ్డాయి...

రెండు వందల సంవత్సరాలు గడిచినై.

ఇప్పటికీ పుట్టిన బిడ్డలు దక్కని తల్లులు యిక్కడకు వచ్చి మొక్కుకుంటారు. ఇప్పటికీ ఆ యింటివారు వాళ్లకి 'పసరు' యిస్తారు. ఆ తల్లులు ఆదిత్రాగి వెళ్లి సుఖంగా ప్రసవించి, బిడ్డతోకూడావచ్చి మొక్కు తీర్చుకుంటారు. ఈ విశేషం తిరుగు లేకుండా జరుగుతూనే వున్నది యిప్పటికీ!

* * *

ఈ కథను శివరావు నమ్మి భక్తిప్రపత్తులతో యిక్కడకు రాలేదు. ...మనుష్యులు తామువేర్పరచుకున్న నమ్మకం నుంచీ, రూపం నుంచీ వరాలు పొందుతున్న వైనం పరిశోధించడానికి ఒక ఆమెరికన్ ఫౌండేషన్‌వారు రూపొందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ ఊరికి పయనమయ్యాడు. కాని అతను పేరాసైకాలజీ డిపార్టుమెంటులో ఆసక్తితో...ఆర్తితో... కొనసాగిస్తున్న పరిశోధన వేరొకటి వున్నది.

దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనౌతున్నాడు. అందులో చాలాభాగం అర్థం లేనివీ, ప్రయోజనం లేనివీను. కొన్నిటిని అనుభవిస్తున్నట్లు అతనికే తెలీదు. కొన్నిటిని నెమరువేసి, సాగదీసి అనుభవిస్తాడు. కాని ఏ ఒక్కటీకూడా అతనికి శాశ్వతం కావటంలేదు! రుచికరమైన పదార్థాలెన్నో కోరితింటాడు. ఆ క్రియ తోనే 'రుచి' అన్న అనుభవం కూడా మాయమైపోతున్నది. అందమైన దృశ్యాల్ని చూసిన అనుభవం, సువాసన, సుఖం, భోగం, నవ్వు... అన్నీ ఏమైపోతున్నవో! అతి కొద్దిభాగం కొంతకాలం వరకూ జ్ఞాపకాలుగా నిలిచినా క్రమంగా జారిపోతవి... మనిషి కోరుకునే కొన్ని ముఖ్యమైన అనుభవాలను ఇచ్ఛాను వర్తులుగా మలచుకొని ఆ అనుభూతులను శాశ్వతం చేసుకొగలిగినప్పుడే మానవ జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుంది! ఇటువంటి సార్వభౌమత కావాలంటే ఆ ప్రక్రియ శాస్త్రబద్ధం కావాలి. దాని భౌతిక ప్రాతిపదిక నిరూపింపబడాలి. ఇటువంటి ప్రయోగం రూపొందిస్తేతప్ప మానవజాతికి నిజమైన మనుగడ వుండదు! ఆదే శివరావు బృహత్ ప్రయత్నం. దాన్ని సాధించగల మార్గం అతనికి ప్రస్తుతానికి కనుచూపు మేరలో ఎక్కడా గోచరించడం లేదు! బహుశా బయోఫీడ్‌బ్యాక్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లద్వారా ప్రయత్నించాలన్న ఆలోచన లీలగా వున్నది. అంతలో ఈ ప్రాజెక్టు పని తగిలింది...

## 3

రామిరెడ్డిది ఊరి చివర్న చేలకానుకునివున్న మిద్దెయిల్లు. తత్కాలానికి రాతిగుళ్లు ఏరితెచ్చి ఒకదానిపైనొకటి పేర్చిపెట్టినట్లున్న గోడలతో చాల పాతకాలపుదిగా కన్పిస్తున్నది. ఉన్న స్థలాన్ని ప్రయోజనకరంగా వినియోగించుకుందామన్న ఆధునిక ధ్యాస ఏ మాత్రంలేనట్లు యింటి ముంగిటా వెనుకా వరుసా, వైనంలేకుండా ఖాళీగా, తీరుబాటుగా అక్కడక్కడా నిలబడివున్న ముద్దమందార దేవగన్నేరు, అరటి మొక్కలూ, మధ్యన చిన్న గడ్డివామీ – అయిల్లూ ఆ పరిసరాల్లో ఎక్కడా ఇరవయ్యో శతాబ్దపు ఛాయ లేనేలేదు! ఆ మనుష్యులూ, ఆ వూరూ, దాని చరిత్ర–మొత్తమంతా ఏదో పురాతన కాలంనుంచీ పట్టుకొచ్చి అక్కడ పెట్టినట్లుగా వున్నది.

శివరావుకి తనరాక మరోలోకంలోకి ప్రవేశంలాగా వున్నది. అతని మనసు గట్టునపడ్డ చేపపిల్లలాగా గిలగిల్లాడింది మొదట్లో. దానికీ, శివరావు ఎరిగిన ప్రయోజనాత్మకమూ, హేతుబద్ధమూ, ప్రణాళికా బద్ధమూ అయిన మనసుకూ పొంతన కన్పించలేదు. తాను గుర్తించలేకుండావున్న మరేదో పొంతన యిక్కడ వర్ధిల్లుతున్నట్లు అతనికి లీలగాతోచినా, దాన్ని అర్థం చేసుకోవడానికి అతను ప్రయత్నించలేదు. అది యీ కాలానికి, యీ మనసుకి చెందిందికాదు!

ఇక్కడికి రాకముందు యిక్కడి పల్లెటూరి చల్లని వాతావరణంలో వారం రోజులు విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాడు. తన పని సందర్భంగా తిరిగి చూడవలసిన వూళ్లు– యిటువంటి చరిత్రలు కలిగిన వూళ్లు – చాలానే వున్నవి. కాని ఎండల్లో ప్రయాణం చెయ్యటాన కలిగిన నీరసం వల్లనూ, యీవూరి స్థలపురాణంవంటి ఆ కథ విన్నప్పుడు అతని అంతర్యంలో చెలరేగిన అస్పష్ట భావసంచలనం వల్లనూ అలా నిశ్చయించుకున్నాడు. వూరు చూశాక వారం రోజులు అక్కడ వుండటాన్ని ఊహించడానికికూడా సాహసం చాల్లేదు. వారం తిరిగేసరికి తనూ యిక్కడి జడపదార్థాల్లో ఒకటిగా మారిపోతానేమో అనుకున్నాడు.

ఇక్కడి స్తబ్దవాతావరణాన్ని గురించిన అతని ఊహల్ని చెదరగొట్టి కొంత ఊపిరి సలిపేట్లు చేశాడు చిన్న – చిన్నెంకటా – చిన్న వెంకటస్వామి.

బస్సు స్నేహితుడు వెంకటస్వామినాయుడు కొడుకు చిన్నా పేరుకు తగినట్లుగానూలేడు. ఊరికి తగినట్లుగానూ లేడు. మదనపల్లె థియొసాఫికల్ కాలేజిలో బి. ఏ. చదివాడు. అప్పట్నుంచీ వూరికెనే తిరుగుతున్నాడు ఉద్యోగం దొరక్క, మరేం చెయ్యాలో తోచక. చూడటానికి అన్ని పట్టణాల్లో కాలేజీల్లో కన్పడే సగటు విద్యా[rthi]లా వున్నాడు.

"మీవంటి చదువుకున్న పెద్దవాళ్లు యిటువంటి పనులు చే[యటం] బాగోలేదు!" అన్నాడు రాపటంతోనే.

అతని ధోరణి శివరావుకి అర్థం కాలేదు. "నేనేం చేస్తున[్నానని] నీ ఉద్దేశ్యం?" అన్నాడు చురుగ్గా.

"చదువుకున్నవాళ్లకి రెడ్డెమ్మ గుండుతో పనేమిటి? కట్టుకథలు! పుక్కిటి పురాణాలు! వీటి కోసం అంతదూరం పనిగట్టుకుని వచ్చారంటేనే మీస్థాయి తెలుస్తున్నది!..." అన[్నాడు] చిన్నా.

రామిరెడ్డి చిన్నాని మందలించాడు, 'ఇంటికొచ్చిన మనుషుల్తో యిట్లేనా మాట్లాడేది?' అంటూ. "మీరు మరోలా అ[నుకో]కండి... వీడెప్పుడూ యింతే! పెద్దా చిన్నా లేదు!... "ఏ[దో] రేషనలిస్టునంటాడు. మమ్మల్నెవర్నీ నోరు మెదపనివ్వడు! పోనీ తెలివిగలవాళ్లా అంటే వాళ్లకీ వాళ్లకీ కుమ్ములాటలు... తనకొక[టి] లేదుగాని అందరికీ బుద్ధులు చెప్తామంటారు!... కుర్రతనం" చిన్నాని మందలిస్తూ శివరావుకి సంజాయిషీ చెప్పుకున్నాడు రామి[రెడ్డి]. తమ్ముడు వెంకటస్వామికంటె లౌక్యుడిగా కన్పించాడు రామిరెడ్డి.

చిన్నా పెదనాన్నను గుర్రుగా చూశాడు. "అదంతా మీక[ు] కాదు! తెలియనప్పుడు తెలియనట్లూరుకోవాలి!..."అని గొణుక్కుంటూ శివరావువైపు తిరిగాడు. "నాస్తిక దృక్పథం కలవాళ్ళమంతా ఒకటి పనిజేస్తే ప్రయోజనకరంగా వుంటుందని మార్క్సిస్టులు, రేషనిస్టు[లు], రాయిస్టు హ్యూమనిష్టులు అందరం కలిసివుంటూ వచ్చాంలెండి.. భావవాదానికీ, మరొకరి భౌతిక వాదానికీ కుదరక విడిపోయార[ు]. అదంతా వీళ్లకేం అర్థమౌతుంది గనక!... నామటుకు నాకు నాస్తిక[త], భౌతికవాదం, రేషనలిజం – మూడూ బాగానచ్చేవే!" అన్నాడు.

శివరావు చిన్నాని ఆసక్తితో పరిశీలించాడు.

"హేతువాదానికీ, భౌతికవాదానికీ, చుక్కెదురన్న పరిస్థి[తి] రానక్కర్లేదు!... నేనూ రేషనలిస్టునే!... ఆ మాటకొస్తే ఇరవయ్యో శతాబ్దంలో జీవిస్తున్న ప్రతి మనిషి ఏదో ఒకరకం రేషనలిస్ట[ు] కాకపోడు!" అన్నాడు శివరావు.

చిన్నా ముఖంలో నవ్వు కన్పించింది. ఆ గదిలో కూర్చున్న వాళ్లందర్నీ చూపిస్తూ "వీళ్లంతా ఏ రకం రేషనలిస్టులంటారు?... వీళ్లకు ఆలోచనల్తో పనేలేదు!" అన్నాడు.

ఆ మాటలు చిన్నూ చెప్తున్న తీరుకు శివరావుకి నవ్వొచ్చింది. రినీ పరికించి చూచాడు. ఇది ఏ శతాబ్దపు జీవితమనవచ్చు ! న్నాడు. అందరిమధ్యవున్న చిన్నూ విలక్షణంగా కన్పించాడు. సపు తాకిడికి ఎదురునిలుస్తున్న వీరుడిలా కన్పించాడు. శివరావుకి ు ఎడల సద్భావం కలిగింది.

తన నవ్వుని పెదాలచాటున బిగపడుతూ అన్నాడు: "ప్రపంచం ప్రతి విషయాన్నీ అర్థంచేసుకుని, ఆధిపత్యం సంపాదించగలశక్తి వ మేధకున్నదన్న నమ్మకమే నేటి రేషనలిజంకు పునాది.... వ మేధ మహాశక్తివంతమైనది ! ఒకవైపు భౌతికశాస్త్ర విజ్ఞానంతో న్ని జయిస్తున్నది. మరోవైపు సైకాలజీని శాస్త్రంగా దిద్ది అవ్యక్తి నను జయించుకొస్తున్నది! అది అపరిమితమైనది ! సృష్టికి ప్రతి గావించేశక్తి గలది !"

చిన్నూ ముఖంలో ప్రసన్నత కన్పించింది. "మరి...మీరు మ్మ గుండు గురించిన విశేషాల్ని పరిశోధించడానికి వస్తున్నట్లు ు రాశారు. అందువలన అపోహపడి అట్లా మాట్లాడాను!.... ువుకున్న ఛాందసులెందర్నో చూస్తున్నాము!" అన్నాడు సంజాయిషీ ప్తున్నట్లు.

"మానవ మేధస్సుకు యిప్పటివరకు మనకు తెలియని నిగూఢ క్తులున్నవనీ, దైనందిన జీవితంలో ఆ శక్తిలోని అతి చిన్నభాగాన్ని మాత్రం మనం ఉపయోగించుకుంటున్నామనీ, మానవ శరీర భౌతిక స్త్రం - అనాటమీ - మిగతా శరీరాన్ని ఎంతో క్షుణ్ణంగా, విపులంగా రిశీలించిందిగాని మెదడు యొక్క స్వరూప స్వభావాలను గురించి లుసుకున్నది అతి తక్కువనీ గమనించినప్పుడు యిక్కడ పరిశో ంచాల్సింది చాలా వుందని ఒప్పుకోవాలి ! అంతేకాదు, పేరాసైకాలజీ ాగా వృద్ధిపొందినపుడు మానవబుద్ధి దానినీ ఒక హేతుబద్ధమైన ాస్త్రంగా రూపొందిస్తుంది !తప్పదు !

"నేనీ విషయాలు అనాలోచితంగా, మూఢనమ్మకాలతో చెప్పడం లేదు !

"ఇప్పుడు పదార్థంనుంచీ శాస్త్రజ్ఞులు ప్రాణం పుట్టించగలిగారు. ఇది విప్లవాత్మక పరిణామం. ఒక రకంగా మెటీరియలిజం - రేషనలిజంలకు జరిగిన కళ్యాణోత్సవమూ, పట్టాభిషేకమూ అనవచ్చు. దీని ప్రభావం వలన ఆధునిక తత్త్వశాస్త్రాలను పునఃపరిశీలించుకోవలసిన ఆగత్యం ఏర్పడింది.

"పదార్థం నుంచీ ప్రాణం, దాని పరిణామ క్రమంలో మానవుని ఆవిర్భావం, అతనిలో విశిష్టమైన చైతన్యపు క్రమవికాసం !.... పరిణామశీలమైన కాలం భవిష్యత్తులోనికి చొచ్చుకొని పోగా, పోగా మనిషియొక్క సమగ్రస్వరూపం సచ్చిదానందం కాకుండా ఎలా వుంటుంది ? ! మనిషియొక్క భవిష్యత్తులో సర్వజ్ఞతా, సర్వశక్తిమత్వమూ ఉన్నాయన్న అచంచల విశ్వాసం 19, 20 శతాబ్దాల విజ్ఞానపు పరుగునుంచీ స్పష్టమౌతూనే వుంది ! ..." శివరావుకళ్లు దూరాల్లోకి చూస్తూ మెరసిపోతున్నవి.

చిన్నూ శివరావుని అనుమానంగా చూస్తూ అసంతృప్తితో నిండిన గొంతుతో అన్నాడు : "మీరెంత చెప్పినా భావవాదాలు నాకు సరిపడవు! ఆత్మ, చైతన్యం, సచ్చిదానందం అన్న పదాలు వింటేనే డోకు!" అన్నాడు వెగటుగా ముఖం పెట్టి.

శివరావు కొంచెంసేపు మౌనంగా వుండిపోయాడు. "హేతువాదం భావవాదం కాదా?" అన్నాడు.

"అటువంటి హేతువాదం నాకఖ్ఖర్లేదు ! శాస్త్రీయ భౌతికవాదం ఒక్కటే సత్యం. అదే నిజమైన హేతువాదం!" మొండిగా అన్నాడు చిన్నూ.

శివరావు తెల్లకాగితం తీసుకున్నాడు. దానిమీద ఎలక్ట్రో మాగ్నటిక్, ఎనర్జీ స్పెక్ట్రమ్ గీశాడు. అందులో మనిషి కన్ను గుర్తించగల సన్నని భాగాన్ని చూపిస్తూ అన్నాడు: "విశ్వమంతా నిండివున్న శక్తిలో యీ చిన్న భాగాన్నే మన కళ్లు గుర్తించగలవు. చూసిన దాన్లో అతికొద్ది భాగం మాత్రమే మనిషి చేతనావరణంలోకి ప్రవేశిస్తుందని ప్రసిద్ధ న్యూరోఫిజియాలజిస్టులు చెప్తున్నారు. కాబట్టి నేను నా కంటితో చూసి గ్రహిస్తున్నదే సర్వమూ అనుకుంటే పొరపాటు. అలా అనుకుంటే శాస్త్రీయ విజ్ఞానం పందొమ్మిదో శతాబ్దంతోనే ఆగిపోయి వుండేది.

"మనం చెయ్యగలిగిందేమంటే మన దృష్టికొస్తున్న క్రొత్త విషయాలన్నిటినీ ఇప్పటివరకూ మనకున్న శాస్త్రీయవిజ్ఞానం ఆధారంతో పరిశీలించాలి. ఆ పరిశీలననుంచీ పుట్టిన ఊహలకు ప్రయోగరూపం యివ్వాలి. ఆ ప్రయోగాల్నుంచీ కొత్త జోస్యాలుపుట్టి, అవి ఋజువైతే అప్పుడాకొత్త విషయమూ శాస్త్రీయం అవుతుంది.

"మన శాస్త్రవిజ్ఞానం యీ విధంగా అపూర్వమైన సాంకేతిక ప్రగతిని సాధించింది. కాని యీ విధంగా రూపొందినమేధ తన కొలతల

కందేదాన్నే సత్యమని చెప్తూ, అందని విషయాన్ని అశాస్త్రీయమని కొట్టిపారేసేతత్త్వం పొందుతుంది. వాటిని మరో ఆలోచన లేకుండా మరుపు తెరల్లోకి నెట్టివేస్తుంది. పేరాసైకాలజీలో తటస్థపడే సంఘటనలు కొలతలకూ, పునఃప్రయోగాలకూ అందవు. గత రెండు దశాబ్దాల్లోనూ బయోఫీడ్‌బాక్ పద్ధతులు రూపొందింపబడి శరీరంలోని చలనాల్నీ, సూక్ష్మస్థితుల్నీ కొలవగల మార్గాలేర్పడ్డవి. కనుక యిప్పుడు పేరాసైకాలజీలో తటస్థపడే సంఘటనలు ప్రయోగాలకు అనువుగానివే అయినా పరిశోధనలకు అనువైనవే! ఇంతవరకూ యీ విషయంలో మనకు జరగవలసిన పరిశోధనలు జరగటంలేదు! వాటి కొరకు తగిన ధనం సమకూర్చేంత నమ్మకమూ, ఉత్సాహమూ లేవు! ఆ పేరుమీద ఏం చెప్పినా బూటకమనే మీరూ, చెప్పిందంతా నిజమనుకునే యితరులూ కూడా అశాస్త్రీయపు ధోరణుల్లోనే వున్నారు.... సూర్యునిచుట్టూ భూమి తిరుగుతున్నదని చెప్పినందుకు - అప్పటి శాస్త్రీయతకు అది విరుద్ధం గనుక - గెలీలియోని హింసించిన క్రిష్టియన్ మత గురువుల్లాగా ప్రవర్తించటం శాస్త్రీయ దృక్పథం కాదు! వెర్రి!" అన్నాడు నిరుత్సాహంగా. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చింది. "ఇవాళ్టి వార్తా పత్రికలో చూసేవుంటావు- ప్రపంచఖ్యాతి గాంచిన మేధావి, నవలా రచయితఅయిన ఆర్థర్ కోస్లర్ తన ఆస్తిలోచాలభాగం పేరాసైకాలజీలో పరిశోధనలకోసం యిచ్చేశారని! ఇది అర్థికంగా తోడ్పడటమేకాక చాల ఉత్సాహాన్ని కూడా కల్గించే విషయం!" అన్నాడు.

చిన్నా సమాధానం చెప్పలేదు. కాని అతని తీరులో శివరావు చెప్పినదాన్ని ఒప్పుకున్న ఛాయలూలేవు.

శివరావుకు విసుగొచ్చింది. 'ఈ పిల్లవాడికి బోధించడం నా బాధ్యత కాదు' అని లోపల విసుక్కుంటూనే పైకి అన్నాడు: "భౌతికత! దాన్ని యాంత్రికంగా భావిస్తున్నావు నీవు! చైతన్యవంతుడైన శాస్త్రజ్ఞుడిలాగా చూడలేకపోతున్నావు! ఆ రెండింటికీ చాలా బేదం వుంది. 'భౌతికత' అన్నదానికి చైతన్య రహితమైన గుడ్డి దాస్యమే యీ 'యాంత్రికత'... మనం సినిమా చూస్తాము. అది నిజంగా జరుగుతున్న విషయం కాదు. కాదని మనకు తెలుసు. దాన్ని చూస్తూ ఏ మాత్రం చలనం లేని అనేక లక్షల విడివిడి ఫొటోల సముదాయంగా భావిస్తూ వుండటమే యాంత్రికత అది మానవ బుద్ధికీ, అనుభవానికీ అనుగుణమైనది కాదు!.... ఆ ఫొటోలను ఒక రీతిలో జరిపినప్పుడు అక్కడ మనకు తెలిసే విషయం వున్నది. దాన్ని గ్రహించటానికి నిరాకరించకూడదు. మనిషి పంచభూతాల సమ్మేళనం మాత్రమే నంటూ జీవితాన్ని నిరాకరించే వెర్రివేదాంతానికి నీవు నమ్మే యాంత్రికతకీ దగ్గరి సంబంధమున్నది! తీరుబాటుగా ఆలోచించుకో! నేనూ భౌతిక వాదినే! ప్రపంచంలో జరిగే ప్రతి కార్యమూ సహజవిధాన ప్రకృతి నియతికి లోబడి జరిగేదే గాని మహత్తులనేవి లేవు! ఆ తిని గ్రహించటమే శాస్త్రజ్ఞుడి లక్ష్యం!....నేను ఇక్కడికి వచ్చాన దానికి కారణం యీ రెడ్డెమ్మ కథలో నమ్మకం వుండటం కాదు! . వంటి సంఘటనలలోని నిజానిజాల్ని శోధించి, మహత్తుల వెనుకన నియతిని కనుక్కోవటమే నా లక్ష్యం!" అన్నాడు శివరావు.

వెనుక గుమ్మం దగ్గర్నుంచీ బంగారు గంటలు మ్రోగిన నవ్వు విన్పించింది. రామిరెడ్డి అటువైపు తిరిగి 'రెడ్డెమ్మా!' కేకేశాడు. ఆలోచనా వీధుల్లో విహరిస్తున్న శివరావు ఆ నవ్వుకీ, వెంటనే వచ్చిన కేకకి ఉలిక్కి పడ్డాడు. తను నమ్మనని చెప్తు కథలోని రెడ్డెమ్మ తనను సవాలు చెయ్యడానికి వచ్చినట్లు క్షణకా భ్రమకల్గిందతనికి.

సన్నగా, పొట్టిగా, బంగారు తీగెలాగా వున్న పద్దెనిమిదే పిల్ల రామిరెడ్డి కూర్చున్న కుర్చీ వెనక్కి వచ్చి నిలబడ్డది. "ఇంద నవ్వింది ఈ పిల్లే కాబోలు!" అనుకున్నాడు శివరావు.

"మీరు పరిశోధించడానికంటూ వచ్చారే, ఆ రెడ్డెమ్మ వంశ లోని పిల్లే యిది!" అన్నాడు రామిరెడ్డి, వెనక్కి తిరిగి ఆప్యాయంగ రెడ్డెమ్మ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

అందరూ తనవైపు తిరిగి చూడటంతో రెడ్డెమ్మ మొహ ఎర్రగా చేసుకుని కళ్లు క్రిందికి వాల్చింది. అయినా ఆ పిల్ల నిల్చున్న తీరులో సిగ్గూ, బిడియం కన్పించలేదు. ఏదో చైతన్యం ఆ శరీరంల చిందులేస్తున్నట్లే వున్నది. ఏ క్షణాన్నో గభాల్న ఎగురుతూ, దుమ కుతూ ఏదో చెయ్యబోతున్నదనే అన్పిస్తున్నది.

ఆ అమ్మాయిని చూడగానే శివరావులో అర్థంకాని అలజడ రేగింది. ఆ అమ్మాయి తనకు యిదివరకే పరిచితురాలైనట్లు తోచింది అది పూర్తిగా నిరాధారమైన ఊహేనని అతనికి బాగానే తెలుసు!

అతనలా చూస్తుండగానే 'ఒస్తా, మామా' అనేసి తుర్రున పరుగెత్తింది రెడ్డెమ్మ. కాని ఆ అమ్మాయి తనవైపు చూసి, నవ్వి, కన్నుగీటిందని స్పష్టంగా చూసిన శివరావు చాలా ఆశ్చర్యపోయాడు!

## 4

రెండవరోజు ఉదయం కాఫీ, టిఫిన్లయ్యాక తన చేలోకి వెళ్తున్న రామిరెడ్డి శివరావుని కూడా తీసుకుని వెళ్లాడు. తన చేను ప్రక్కనేవున్న తొట్లోరిపల్లెలోని రెడ్డెమ్మ అన్నల యింట్లో దిగబెట్టాడు.

రామిరెడ్డి బయటికి వెళ్లగానే మెరుపుతీగెలాగా లోనికి వచ్చింది మ్మ.

ఒంటరిగా కూర్చున్న శివరావుని చూసి కొంటెగా నవ్వుతూ హుకాల దర్శనమ్' అన్నది చిన్నగా, రహస్యం చెబుతున్నట్లు.

శివరావు ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంగా చూస్తూ "నేనెవరను టున్నారు? ఏదో పొరపాటు పడుతున్నట్లున్నారు!" అన్నాడు.

రెడ్డెమ్మ నవ్వుతూ లోపలికెళ్లిపోయింది.

ఆ పిల్ల ప్రవర్తన శివరావుకు అంతుబట్టలేదు.

ఇంతలో యింటి యజమాని రెడ్డెప్ప వచ్చాడు. అతను చాల తభాషి, నిదానస్తుడు. శివరావు వచ్చినపని కనుక్కున్న తర్వాత తనికి మాట్లాడటానికి, చెప్పడానికి ఏమీ లేకపోయింది. బుజంమీది వ్వాలుతో ముఖం తుడుచుకుని గమ్మున కూర్చుండి పోయాడు.

శివరావు మనసునిండా రెడ్డెమ్మ వింత ప్రవర్తన గురించిన లోచనలు ముసురుకుని వున్నాయి.

ఎవరో యాత్రీకుల కుటుంబం వచ్చింది. ఇద్దరు ఆడవాళ్లూ, క మగమనిషీను. వారిలో మధ్య వయస్కురాలైన స్త్రీ రెడ్డెప్పను లకరించింది. "నీకు గుర్తుండదులేగాని.... ఆ, అప్పుడు నువ్వెంతు న్నవులే... ఎప్పుడో పద్దెనిమిదేళ్ల క్రిందటి సంగతి! మీ చెల్లెలు ప్పుడే పుట్టింది. నాకు పిల్లలు పుట్టిపోతూవుంటే యిక్కడికొచ్చి, రపడి, పసరుతాగి వెళ్ళాను. ఇదిగో యీ పిల్ల - రెడ్డెమ్మ - పుట్టింది• గానికి పెళ్లిచేసి నాలుగేళ్ళవుతున్నది. దీనికీ యిద్దరు బిడ్డలు కలిగి పోయారు, నాయనా... అంతా నా సాలే వచ్చింది దీనికీను!... ఇహ యిది పనిగాదని కూతుర్నీ, అల్లుణ్ణీ యిక్కడికే తోడుకొచ్చాను... రెడ్డెమ్మ తల్లి ధర్మమా అని యీ పిల్ల యీసారి బిడ్డనెత్తుకోవాలి!" అంటూ లెంపలేసుకుని దణ్ణం పెట్టుకుంది.

ఆమె చెప్పిందంతా ఓపిగ్గా విన్నాడు రెడ్డెప్ప, సమయోచితంగా తల తాటిస్తూ. అంతా విన్నాక గంభీరంగా "గుడికెళ్లిరండి" అంటూ లేచి నిల్చున్నాడు.

శివరావు కూడా లేచి శెలవు తీసుకుని బయటకు వచ్చాడు. ఆ కుటుంబంతో పాటు గుడికి వెళ్దామన్న అభిప్రాయంతో రెండడుగులు వేశాడు. కొంచెం దూరంలో చిన్నూత్తండ్రి వెంకటస్వామి వెళ్తూ కనిపించాడు. శివరావు త్వరత్వరిగా నడిచి అతన్ని కలుసుకున్నాడు.. రెడ్డెమ్మ వరుస ఏమిటో కనుక్కోవాలని ఆరాటంగా వుందతనికి.

"రెడ్డెమ్మ అనేపిల్లకి పూనకాలేమన్నా వస్తాయా?" అనడిగాడు

"ఎబ్బే, అట్లాంటిదేంలేదే!" అన్నాడు వెంకటసామి.

"భూత భవిష్యత్తులు చెప్పటం వుందా?"

"ఎబ్బే, అట్లాంటిదేం లేదు!"

"అతీంద్రియ శక్తులేమైనా వున్నాయా?" అన్నాడు శివరావు పట్టువిడవకుండా.

వెంకటసామి పెద్దగా నవ్వేశాడు. "మీరు ఇట్టాటి పనిమీదే వచ్చారని తెలుసనుకోండి...కాని మా కళ్లెదురుగా పుట్టి పెరిగిన పిల్ల అది....మన చెర్లోపల్లెలో పదో క్లాసు దాకా చదివింది. రెడ్డెప్ప చెల్లె లికి పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నాడు" అంటూ వివరించాడు.

అయినా శివరావుకు సందేహం తీరలేదు. "ఆ అమ్మాయి. మామూలు పల్లెటూరి పిల్లలాగా కన్పించటంలేదు" అన్నాడు.

"మా పల్లె జనం గురించి ఏమనుకుంటున్నారో మీరు! ఎంత తెలివి మంతులైనా పట్నీలు కొట్టించగల చతురులున్నారిక్కడ... రెడ్డెమ్మ చాలా చురుకైన పిల్లలెండి, వాళ్లపూర్వీకురాలు కూడా ఇట్లాంటిదేనంటారు. ఆమె కళలే యీ పిల్లకూ వున్నయ్యాని పెద్దోళ్లంటుం టారు." అన్నాడు వెంకటసామి.

"నిజమే! నిజంగానే ఏవో వింతకళలున్నాయీ పిల్లకు అను కున్నాడు శివరావు వెంకటసామి చెప్పినట్లు యిదంతా కేవలం చాతు ర్యమూ, అల్లరీ అనుకుంటే అతని మనసు తేలిక పడింది.

ఆరోజు సాయంత్రం ఎండకాస్త నిమ్మళించాక రెడ్డెమ్మ గుండును చూడటానికి బయల్దేరాడు ఒంటరిగా. మొక్కుబళ్లు చేసుకో డానికో, చెల్లించుకోడానికో వచ్చిన జనం కన్పిస్తే వాళ్ళని పరిశీలించా లనీ, ప్రశ్నించాలనీ అనుకున్నాడు.

శివరావు యిక్కడ వుండాలనుకున్న వారంరోజుల్లో ఒకరోజు గడిచిపోయింది.

చేలుదాటి, కాలిబాట గుండువైపుకు మలుపు తిరుగుతుండగా వెనుకనుంచి వచ్చింది రెడ్డెమ్మ.

"నమస్కారమండీ నవాబుగారూ!" అన్నది బెరుకులేకుండా!

"నా గురించి నీకు తెలియదు. నన్ను చూసి ఎవరో అనుకుని పొరపాటు పడుతున్నట్లున్నావు!" అన్నాడు శివరావు ఆశ్చర్యంగా.

"మీరు గుర్రంకొండ నవాబుగారు కాదా?" అమాయకంగా ముఖం పెట్టి అడిగింది రెడ్డెమ్మ.

ఈ కాలంలో నవాబు లేమిటి? పదోక్లాసు చదివిన పిల్లకు ఈ మాత్రం తెలియదా? రెడ్డెమ్మ ఎందుకో తనను వెక్కిరిస్తున్నదని అర్థం చేసుకున్నాడు.

"ఊఁ, నేను నవాబునైతే నువ్వెవరు?" అన్నాడు.

"నేను రెడ్డెమ్మనండీ...అదిగో, ఆ కనబడేది మా యిల్లు.... యివాళ ప్రొద్దుట మా యింటికొచ్చారు, మరచిపోయారా?" అమాయకంగా అడిగింది.

శివరావుకు నవ్వొచ్చింది.

"నేను నవాబునీ, నీవు రెడ్డెమ్మవీ అయితే యిప్పుడు నేనేం చెయ్యాలి?" అన్నాడు.

శివరావు యింకా పెళ్లి చేసుకోలేదు, ముప్పైఅయిదేళ్లు దాటుతున్నా. దానికి ఎన్నో కారణాలు. కాని అతనికి ఆడపిల్లలు తెలుసు. ఆడపిల్లల్తో కొన్ని అనుభవాలున్నాయతనికి — అనుకోకుండా తారసపడి, కొద్దికాలంలో సన్నగిలిపోయిన తాత్కాలిక సంబంధాలు. అతనికి ప్రేమలో ఆసక్తి లేదు. అతని దృష్టిలో ఒక ఆడపిల్ల ఒక అనుభవం మాత్రమే. వాళ్లని గురించి ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించలేదు. ఇప్పుడు రెడ్డెమ్మను ఆసక్తితో చూస్తూ "నీవు మామూలు అమ్మాయివి కాదు!" అన్నాడు.

"అమ్మయ్య, గుర్తించారా?" అంటూ నవ్వింది. "నేను మామూలు అమ్మాయినెలాగౌతాను? మీకు వేషం మారుతున్నది. అప్పుడు నవాబువేషం, యిప్పుడు శాస్త్రజ్ఞుడి వేషం! అదొకరకం అహంభావం, యిదింకోరకం అహంభావం!.... కాని నేనుమాత్రం అప్పుడూ, యిప్పుడూ కూడా రెడ్డెమ్మనే!" అన్నది దర్పంగా.

ఆ అమ్మాయి నవ్వుతాలుగానే మాట్లాడుతున్నదని నమ్మలేక పోతున్నాడు శివరావు. రెడ్డెమ్మ ముఖంలో విచిత్రమైన చిరునవ్వు. ఆ మాటలు తన మనసులో రేకెత్తిస్తున్న అలజడి...ఈ అమ్మాయి యిలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి? "నాకేమైనా చెప్పాలని ప్రయత్నిస్తున్నదా?" అనుకున్నాడు.

కల్పనా నిజమూ భూత వర్తమాన కాలాలూ కలగా పులగంగా పెనవేసుకుపోయి అతని మనసు తుఫానులోని సముద్రంలాగ అల్లకల్లోలమై పోయింది.

కొంతసేపటికి నిలవరించుకుని "ఈ పల్లెటూరికొచ్చి ఏదో మాయలో చిక్కుకు పోతున్నాను!" అనుకున్నాడు నిస్సహాయంగా.

ఇద్దరూ రెడ్డెమ్మగుండు దగ్గరకు వచ్చారు.

అక్కడ నిర్మానుష్యంగా వున్నది. కోనేరూ, దద్దనాలూ, చేలూ నిశ్శబ్ద ప్రశాంతిలో మునిగివున్నాయి.

దాన్ని చూడగానే శివరావు మనసులోని కల్లోలం అణగారి పోయింది. అనంతమైన ఆకాశం,— చూపుమేరంతా విస్తరించుకుపోయిన ఖాళీనేల- అంతూ దరీ లేని ఆ వైశాల్యంలో చిన్ని గుట్ట, దానిమీద నిల్చునివున్న గుండు... ఆ శూన్యం అతన్ని ఆశ్చర్యపరచింది. అతణ్ణి వెన్నుతట్టి లేపి, అనంతమైన భావలోకాల్ని స్ఫురణలోకి తెచ్చి అందీ అందనట్లు నిలిపింది.

ఆ వైశాల్యంలో, ఆ అనంతత్వంలో ఆ వరదాత రెడ్డెమ్మ గుండు పూర్తిగా అప్రధానమైనదై, బోసిపోయి నిలిచివున్నది!

ఇద్దరూ రాతి మెట్లెక్కుతూ పైకి వెళ్లారు.

ఆ పెద్దగుండులో తొలిచినట్లు చిన్నిగుహ. అందులో ప్రతిమ. వెనుక రాతి చీలిక.

"ఈ సన్నని రాతి చీలికలోనుంచి ఒక మనిషి – ఎంత సన్ననిదైనా – లోనికి వెళ్లిందంటే – సాధ్యమయ్యే పనికాదు!" అన్నాడు శివరావు పాత కథను గురించి ఆలోచిస్తూ.

"కాని జరిగింది!" ఆమె గొంతులో ధ్వనించిన విశ్వాసానికి, ఆమె చెబుతున్న తీరుకు ఆశ్చర్యంతో ఆమెను పరీక్షగా చూశాడు.

"సాధ్యా సాధ్యాలమధ్య నువ్వనుకునే అంతరం లేదు!" దృఢంగా అన్నది రెడ్డెమ్మ.

ఆమె ముఖంలో నవ్వీనవ్వనట్లు ఒక భావం. నిలుచున్న తీరులో విలాసం. సంధ్యాకాలపు బంగారుకాంతిలో ఒక దేవీమూర్తిని చూస్తున్నట్లు భ్రమ కలిగింది శివరావుకు.

ఎదురుగా వున్న దేవీ విగ్రహాన్నీ, ఆమెనూ మార్చి మార్చి చూశాడు.

అజ్ఞాతమూ, అజ్ఞేయమూ అయిన సత్యం కళ్లెదుట ప్రత్యక్ష మైనట్లుగా అనుభూతి మనసులో నిండిపోయింది.

"ఆ రహస్యాన్ని ఛేదించాలనే, దాన్ని సాధించాలనే నా ప్రయత్నం కూడా!" అన్నాడు నిమ్మళంగా.

పెద్దగా నవ్వేసింది రెడ్డెమ్మ. "అట్లయితే నువ్వా ఆ చీలికలో నుంచీ లోపలికెళ్లు!" అన్నది.

ఆమెతీరు యిప్పుడు ఒక సాధారణ బాలిక కొంటెగా మాట్లాడు కున్నట్లే వున్నది.

ఆమె సంబోధన 'మీరు' నుంచీ 'నువ్వు' లోకి మారిపోయిందని గమనించాడు.

"ఆ లోపలికెళ్ళడం నా లక్ష్యం కాదు! మనిషికోరుకున్న అనుభూతులకు భౌతిక ప్రాతిపదిక నిచ్చి, వాటిని అతని అధీనంలోకి తేవాలి! అదే నా లక్ష్యం!" అన్నాడు చికాగ్గా.

"అనంత తత్త్వం నుంచీ వస్తున్న జీవితానుభవాలు అనుభూతు లుగా రూపొందుతున్నవి. వాటిని పునఃసృష్టి చెయ్యడం జరగదు!" అన్నది రెడ్డెమ్మ తల అడ్డంగా వూపుతూ.

ఆ పిల్ల మాట్లాడుతున్న తీరుకు శివరావుకు కోపమూ, నవ్వూ కూడా వచ్చాయి.

"తల అంత జోరుగా ఊపకు! ఈ పల్లెటూళ్లో, కదలిక ఎరుగని కాలంలో చిక్కుబడ్డ నీకు అన్నీ తెలుసుననుకుంటున్నావు! శబ్దాన్ని ఒక రికార్డులోనో, టేపులోనో పట్టి తిరిగి సృష్టించగలుగు తున్నారని తెలుసా? అలాగే యథార్థ అనుభవం మేధస్సులో అనుభూతిగా మారటం అన్న ప్రక్రియ వెనుకనున్న భౌతిక సూత్రాల్ని గ్రహిస్తే అదీ సాధ్యమౌతుంది! ఈ సాంకేతిక యుగంలో మనిషికి అసాధ్యం అన్నది లేదు! గడచిన రెండు శతాబ్దాల కాలంలో మనిషి పురోగమిస్తున్న తీరు మనిషిని ఏ స్థాయికి తీసుకెళ్లిందంటే – అతను అతీత మానవుడయ్యాడు. అతని ఉత్సాహం అన్నిటినీ సాధ్యంచేసి తీరుతుంది!

చంద్రుడిమీద కాలుమోపగలననీ, నవగ్రహాల్ని పరిశీలించ గలననీ, తోకచుక్క తలలోనుంచీ పదార్థం పట్టుకొచ్చి పరిశోధించాలనీ యాభైఏళ్ళ క్రితం మనిషి ఊహించగలిగే వాడుకాదు. కాని ఈ రోజు అది సాధ్యమౌతున్నది! ఇప్పుడిప్పుడే యీ ప్రపంచంలో స్థిరపడు తున్నది ఎలక్ట్రానిక్స్‌యుగం. ఎలక్ట్రానిక్స్ ప్రగతీ, జెనెటిక్ ఇంజనీరింగ్ క్లోనింగ్, మాలిక్యులర్ బయాలజీ వంటివి మానవజీవితాన్ని యింకో వందేళ్ళలో ఎలామార్చగలవనేది యీరోజు మన ఊహకుకూడా అందదు! సాంకేతిక యుగం యొక్క పరిపూర్ణత చూపుమేరలోకి వచ్చింది! త్వరలోనే మనిషికి రోగం, చావు అన్నది పూర్తిగా మాయం కావచ్చు..." అంటూ ఆగాడు.

ప్రక్కకు తిరిగి చూశాడు. అక్కడ రెడ్డెమ్మలేదు!

బయటకువచ్చి చుట్టూ చూశాడు.

చూపుమేరంతా చేలు. అంతా నిర్మానుష్యంగావుంది. అతనికి అకారణమైన అదుర్దా కలిగింది. ఇంతవరకూ మానవుని అమరత్వంలో, అజేయతలో మహోన్నతస్థాయిలో విహరించిన మనసు పాతాళంలోకి పడిపోయింది.

....కాల ప్రవాహంలో మునిగిపోయి ముందూవెనుకలెరక్కుండా చీకటి దారుల్లో కొట్టుకుపోయింది...

ఆ అయోమయంనుంచీ బయటికిరాగానే ఎందుకో అతనికి రెడ్డెమ్మ ఆ రాతి చీలికలోనికి వెళ్ళిపోయిందన్న నిశ్చయం కల్గింది.

ఎంతో విలువైన వస్తువును పోగొట్టుకున్నట్లుబాధ. తన జీవితాన్ని అతలాకుతలంచేసే ఏదోఒక అనుభవ విశేషం తన అధీనంలో లేకుండా చర్వితచర్వణం అవుతున్నదన్న భావనలో నిస్సహాయత...

"అయిందా ఉపన్యాసం?" అంటూ నవ్వుతూ గుహలోపలి ఒక చీకటిమూల నుంచీ బయటకు వచ్చింది రెడ్డెమ్మ.

"ఈ పిల్ల ఒట్టి బుద్ధిలేని ఆటలు ఆడుతున్నది!" అనుకున్నాడు. తనమనసులో యింతకుముందు కల్గిన హేతువిరుద్ధమైన ఆలోచనలకు, ఆదుర్దాకు తనమీద తనకే కోపం, విసుగు కల్గాయి. 'నాబుద్ధి ఏమైంది? ఇంతసేపూ నేను చెప్పింది నా నమ్మకంనుంచికాదా? లేక ఊకదంపుడు ఉపన్యాసమా?....ఎందువలననో నేను నేను కాకుండా పోతున్నాను?" అనుకున్నాడు.

ఏమీ జరగనట్లుగానే సంభాషణ కొనసాగించింది రెడ్డెమ్మ. "మనిషి కేవలం హేతుబద్ధంగా ఆలోచించి, ప్రవర్తించే యంత్రమే

నంటున్నావా? తాను కావాలనుకున్న అనుభూతుల్ని సృష్టించుకుంటూ వుంటే ఆనందమూ, తృప్తీలభిస్తాయని నమ్ముతున్నావా?

...నీవు చెప్పే మహత్తరశక్తులు సాధించిన ప్రపంచం నిలవాలంటే మానవజాతి అంతా కలసి ఒకేఒక యంత్రంఅయిపోవాలి. ప్రతి మనిషీ ఆ బృహత్ యంత్రంలో ఒక మరమేకు అవాలి! అప్పుడు బ్రతుకులోని తీపి, సౌందర్యం, ఆనందం అన్నీమాయమైపోతవి. జాతి సాధించిన శక్తిబరువుకు ప్రతిమనిషి వ్యక్తిత్వమూ చదునైపోతుంది. కాని నీకు సుఖానుభూతుల్ని శాశ్వతంచేసుకోవాలన్న ఆరాటమెందుకు? నీవనుకున్న వన్నీ జరక్కపోయినా యిప్పుడూ ఎప్పుడూకూడా మనిషి తన ప్రవృత్తికి అనుగుణమైనదీ, మరోస్థాయిలో తను కోరి వరించినదీ అయిన జీవితాన్ని అనుభవిస్తున్నవాడే!'' అన్నది.

''అది నీ భ్రమ!... ఒకవేళ నీవు చెప్పేది నిజమే అయినా నేటి మనిషికి కావల్సింది అది కాదు! వ్యక్తిపరంగానూ, మానవజాతి పరంగానూ కూడా ప్రగతిరూపమైన లక్ష్యం వుండాలి! అప్పుడే మానవుడు సృష్టికధిపతియై చిరంజీవి అయ్యే అవకాశం వస్తుంది!'' అన్నాడు శివరావు గట్టిగా.

''సృష్టి నిత్యనూతనం, ద్దాన్లో చలనం ఎప్పుడూవుంటుంది.దానికి ప్రగతి అని పేరు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.... నీవు చెప్పే చిరంజీవి త్వరలో జీవం వుండదు! జీవానికి ఒకటే లక్షణం వున్నది. అది ఆనందం. అదే మనుగడకు మూలం. ఏడుపుకీ, నవ్వుకీ, కష్టానికీ దుఃఖానికీ, గెలుపుకీ, ఓటమికి అన్నిటికీ వెనుక ఆనందమే లేకపోతే మానవజాతి యీలోకంలోని దుఃఖంలో ఎప్పుడో నశించిపోయిఉండేది! ఆ ఆనందమే జీవలక్షణం. దాన్ని క్షణక్షణం గుర్తించటమే జీవితానికి లక్ష్యం. దాని మరోరూపమే ప్రేమ! మనిషికీ, జీవితానికీ సంబంధం అదే!'' అన్నది రెడ్డెమ్మ.

ఆమె ప్రతిమకు వెనుకగా, రాతిబీలికకు ముందుగా నిలుచుని వున్నది. అదే స్వస్థానమైనట్లు ధీమాగా నిలుచుని, పామరుడికి గీత బోధిస్తున్నమహర్షిలాగా చెబుతున్నది.

ఆ అమ్మాయి యింతకు ముసుపు ఎక్కడోదాక్కని తన ఆటపట్టించిన విషయం జ్ఞాపకం వచ్చింది శివరావుకు. ఈ పిల్ల నమ్మకాలు వెల్లడిస్తున్నదా ? లేక ఊరికే వాక్చాతుర్యం చూపిస్తున్న ఇది యింకో ఆటా? అన్న సందేహాలూ వచ్చాయి.

'ఎంత తెలివి మంతులైనా పల్టీలు కొట్టించే చతురులున్నా యిక్కడ' అన్న వెంకటస్వామి మాటలు గుర్తుకొచ్చాయి.

'ఇది యింకో ఆట ! ఈ అమ్మాయి ఒక గడుగ్గాయి !' అ కుంటే పెద్ద బరువుదించుకున్నట్లయింది.

ముసురుకు వస్తున్న సంధ్య చీకట్లను చూస్తూ ఇద్దరూ గు మెట్లు దిగారు.

ఇంటికి వెళ్తున్న శివరావుకు తిరిగీ మనస్సు అల్లకల్లోలకై పోయింది. తాను ఉన్నత విద్యావంతుడు. మనస్తత్వ, దర్శన శాస్త్రాలి ఔపోశన పట్టినవాడు. ఆ పిల్ల పల్లెటూరి హైస్కూల్లో పదోక్లాస వరకు చదివింది. తనకు సమస్థాయిలో సమాధానాలు చెప్తున్న ఆమె చెప్పేదంతా ఉత్తుత్తి వాగాడంబరంగా త్రోసివేయ వీల్లేనిది. ఆ నేలమీద పుట్టినవాళ్లు ఈ గాలిలో నుంచీ ప్రాణవాయువుతోపాటూ గ్రహించే ధర్మమూ, తత్త్వమూ ఎంతో ఉండొచ్చు. కాని యితరులలో చాదస్తంగానో, మూర్ఖతగానో మిగిలిపోయేదాన్ని యీమె అనుభ సారంలాగా చెప్పగలుగుతున్నదేమిటి? అసలు యీ రెడ్డెమ్మకు తనకూమధ్యనుండే సంబంధం ఎలాంటిది ? ఈపిల్ల విచిత్రప్రవర్తనకు కారణమేమిటి ?

ఆ గుండులోపల రెడ్డెమ్మ నిల్చున్నతీరు, ముఖంలోని భావం అది తనలో కల్గించిన హేతు విరుద్ధమైన భావ సంచలనం - అన్నీ తిరిగీ జ్ఞాపకంరాగా శివరావులో వర్తమానంతో, అతని ఆలోచన ధోరణితో సంబంధంలేని కలవరం కలిగింది.

ఈ పిల్లపట్ల తన మనసులో యింత ఆసక్తి, ఇన్ని ఆలోచనలు ఎందుకు కలుగుతున్నవి ? ఈ ఆకర్షణకు కారణం ఏమిటి ? అన్నీ ప్రశ్నలే ! సమాధానంలేని ప్రశ్నలు !

[ ఇంకా వుంది ]